## కథ

# వీడ్కోలు

- ప్రయాగ రామకృష్ణ



**రాముడికి పట్టాభిషేకం రాచనగర మంతా కోలాహలంగా వుంది. పచ్చటి తోరణాలతో, పతాకాలతో, మంగళవాద్యాలతో, హర్షోల్లాసాలతో ప్రతి ఇల్లూ చూడ ముచ్చ టగా వుంది. సుందరాంగనలు ఇళ్ళ ముందు సుగంధ జలాలు చల్లి ముగ్గులు పెట్టారు. నగర వీధుల్లో పన్నీరు చిలకరించారు. దశదిశలా జయ జయనాదాలు ప్రతిధ్వనిస్తు న్నాయి. ఆ బాల గోపాలం మంగళగీతాలు ఆలపిస్తున్నారు.**

రాముడు సింహాసనం అధిష్ఠించబోతున్నాడు. అదీ ఆనందం.

'దాశరథికీ జై – రామచంద్ర మహరాజుకి జై – లక్ష్మణస్వామికి జై' అంటూ జనం పెద్దగా నినా దాలు చేస్తూ పరుగెత్తుతున్నారు. అందరూ రాజప్రాసాదం ముఖద్వారం వద్ద సమావేశ మయ్యారు.

దశరథ తనయుడిని ఎత్తైన సువర్ణ పీఠం మీద కూర్చోబెట్టారు. ఆయన పక్కనే సీతమ్మ తల్లి వుంది. వారిద్దరికీ ముత్తైదువలు హారతులిస్తున్నారు. వేదిక చుట్టూ వున్న కొందరు వారి మీద పూలు చల్లుతున్నారు. మరికొందరు వింజామరలు వీస్తున్నారు.

ఇంతలో వసిష్ఠ మహర్షి వచ్చాడు.

రామభద్రుడు లేచి గురుదేవుల చరణాలకు శిరసా వందనం చేశాడు.

మహర్షి ఆయనను లేవనెత్తి గాఢాలింగనం చేసుకుని ఆశీర్వదించాడు.

'నాయనా! నీ సందర్శన, సంస్పర్శాదులతో నేను శాంతించాను. ఇన్నాళ్ళ వియోగ బాధ నుంచి' నా మనస్సుకు ఉపశమనం కలిగింది' అని వసిష్ఠుడు అంటూ వుండగానే సీతాదేవి కూడా ఆయనకు వినమ్రంగా నమస్కరించింది.

'అఖండ సౌభాగ్యంతో వర్ధిల్లు తల్లీ' అని మంగళాక్షతలు ఆమె శిరస్సుపై చల్లాడు. ఇంతలో లక్ష్మణుడు వచ్చి ఆయన పాదాలకు ప్రణమిల్లాడు. మహర్షి అతనిని దగ్గరకు తీసుకుని శిరస్సుపై ముద్దు పెట్టుకున్నాడు.

భరత శత్రఘ్నులు మహర్షి పాదాలను స్పృశించి కళ్ళకు అద్దుకున్నారు.

మహర్షి వాళ్ళిద్దరినీ అక్కున చేర్చుకున్నాడు. అందరూ కలిసి వేదిక దగ్గరకు వెళ్ళారు.

సుముహూర్తం చూసి వశిష్ఠుడు రత్నభూషిత సింహాసనం మీద రామచంద్రుణ్ణి కూర్చోపెట్టి సువర్ణ కిరీటం ధరింపచేశారు. పవిత్ర నదీ జలాలతో నింపిన కలశాలను తెప్పించి ఆ నీటిని రామచంద్రునిపై చల్లారు. సూర్యవంశ మర్యాదానుసారం సుమంగళ జనం వేదిక మీదకు వెళ్ళి రామభద్రుని నుదుట తిలకం దిద్దారు. పురోహితులు వేదమంత్రాలు పఠించారు. 'జయోస్తు దిగ్విజయోస్తు' అని మహర్షులు ఆశీర్వదించారు. 'సీతారాములకు జయం, జానకీ మనోహరుడికి జయం, సీతావల్లభుడికి జయం' అని పురజనులు జయ జయ నాదాలు చేశారు. భూమ్యా కాశాలలో అని ప్రతిధ్వనిస్తూ వుండగా రామచంద్రుడు మహారాజుగా పట్టాభిషిక్తుడైనట్టు అమా త్యుల వారు ప్రకటించారు. సీతాసమేతంగా శ్రీరాముడు రాజసింహాసనం అధిష్టించటం చూసి అందరూ ఆనందపడ్డారు.

***

రాముడికి పట్టాభిషేకం జరిగాక రెండు నెలల పాటు భల్లూక వానర వీరులందరూ అయోధ్యలోనే వున్నారు. షడ్రసోపేతమైన వంటలు, విందులూ ఆరగిస్తూ తమ రాజ్యానికి వెళ్ళాలన్నా సంగతే మరచిపోయారు వాళ్ళు. ఇన్నాళ్ళూ సీతాన్వేషణలో మునిగి వున్నారు. రామకార్యాన్ని సాధించడం కోసం సుశిక్షితులైన సైనికుల్లా రేయింబవళ్ళూ పనిచేశారు. కార్యభారంతో సతమతమయ్యారు. ఇప్పుడే బాధ్యతాలేదు. స్వామికార్యాన్ని అత్యంత భక్తిప్రపత్తులతో తీక్షతో నిర్విఘ్నంగా నెరవేర్చా మన్న ఆనందంలో వున్నారు. ఆ ఆనందంలో తల మునకలవుతూ సంతోష సాగర తరంగాల మీద పూల తెప్పల్లా చేష్టలన్నీ గుర్తుకొచ్చాయి. గోడలెక్కుతూ గొబ్బెలెక్కుతూ చెట్ల మీదకు దూకుతూ ఆకులు కాయలు రాలుస్తూ దారిన వచ్చిపోయే వారిని వెక్కిరిస్తూ, వాళ్ళ వెంట పడుతూ వూరంతా ఓ కొలిక్కి తెస్తున్నారు.

రాముడు అదంతా చూసి ఆనందిస్తున్నాడు.

కాని, వాళ్ళు ఇంకా ఎక్కువకాలం అయోధ్యలో వుండడం బాగుందనిపించింది రాముడికి. వాళ్ళని వెళ్ళిరమ్మని అనుమతిచ్చాడు.

అందరూ రాముడి దగ్గరకు వెళ్ళి శెలవు తీసుకునేటప్పుడు ఆంజనేయుడు కన్నీటితో ప్రభువుకు నమస్కరించి 'స్వామీ' నా స్నేహం, నా భక్తి నీ పట్ల ఎల్లప్పుడూ వుండాలి. నా మనస్సు ఎప్పుడూ నీ

మీదనే నిలవాలి. ఈ నేల మీద రామకథ వున్నంతవ రకూ నా శరీరంలో ప్రాణాలు నిస్సంశయంగా వుండాలి. రామా! పురుషోత్తమా! తండ్రీ! నీ దివ్యకథ అప్సరసలు నాకు అనుక్షణం వినిపిస్తూ వుండాలి. అది వింటూ నిన్నే స్మరిస్తూ నీకు దూరంగా వున్నానన్న బాధను మరచి పోయి బతుకుతాను' అని వేడుకున్నాడు.

రాముడి మనస్సు ఆర్ద్రమయింది.

సింహాసనం మీద నుంచి లేచి వచ్చి స్నేహంతో హనుమంతుణ్ణి గాఢాలింగనం చేసుకున్నాడు. 'వానరో త్తమా! నువ్వేది కోరుకుంటే అది జరుగుతుంది. ఇందులో సందేహం లేదు. నిస్సంకోచంగా వుండు. లోకంలో నా కథ వున్నంతవ రకు నువ్వు చిరంజీవిగానే వుంటావు. నీ కీర్తి అజరా మంగా వుంటుంది. అయినా మిత్రమా ఎందుకోయ్ నీకింత భయం. లోకాలున్నంత వరకూ మన కథలుం టాయని చెబుతున్నాగా' అని వూరడించాడు.

## మే 19 హనుమజ్జయంతి ప్రత్యేకం

ఆంజనేయుడు కృతజ్ఞతగా చేతులు జోడించి వెనక్కి తిరిగాడు.

వెనక్కి తిరిగాడే గాని అడుగు కూడ ముందుకు పడ లేదు. రాముణ్ణి వదిలి వెళ్ళటం, రాముడికి దూరంగా బతకటం అతని వల్ల అయ్యేలా లేదు. తలుచుకున్న కొద్దీ దిగులేస్తోంది హనుమన్నకు. వెనక్కి తిరిగి చూశాడు. రామప్రభు వున్న చోటే నిల బడి వున్నాడు. హనుమను విడిచి లోపలికి వెళ్ళలేక పోయాడు. ఇద్దరి కళ్ళూ వూటబుగ్గలయ్యాయి. ఇద్దరి కళ్ళూ నేలబావులయ్యాయి. ఇద్దరి కళ్ళూ దిగుడు బావులయ్యాయి. ఒకరి కంటికి మరొకరు అస్పష్టంగా రంగు వెలిసిన బొమ్మల్లా కనిపిస్తున్నారు. రాముడు ప్రేమగా 'హనమా' అని పిలిచాడు. ఆ పిలుపుకోసమే ఎదురు చూస్తున్నట్టు 'ప్రభూ' అన్నాడు ఆర్తిగా హనుమ. రాముడు తన బంటుని దయతో చూస్తూ 'హనమా! నువ్వు నాకు చేసిన ప్రతి ఉపకారానికీ నేను ప్రాణాలు ఇవ్వాలసి వుంది. అయితే, ఒక ఉపకారానికి బదులుగా ప్రాణాలిచ్చేసిన తరువాత మిగిలిన ఉప కారాలు మాటేమిటి? వాటన్నిటి బాకీ ఎప్పుడు తీర్చుకోను? అయినా, నువ్వు చేసిన ఉపకారాలకు ప్రత్యుపకారాలు చేసి బాకీ తేర్చేసుకోవాలన్న ఆలోచనే భయంకరంగా అనిపిస్తుంది నాకు. నువ్వు చేసిన ఉపకారాలకు నేను ప్రత్యు పకారం చేయాలనుకుంటున్నానంటే అర్థం ఏమిటి? నీకు కూడా ఏవైనా ఆపదలు రావాలని నేను అంత రాంతరాల్లో కోరుకుంటున్నట్టే కదా! అందువల్ల నీకు ప్రత్యుపకారం చేయాలన్న ఆలోచనే నాకు రాకూ డదు. ప్రత్యుపకారం చేయాలన్నా ఆలోచన నాలోనే జీర్ణమైపోవాలి. ఏ ఆపదలూ లేకుండా నువ్వు సుఖంగా హాయిగావుండాలి' అని తన ప్రేమాభిమా నాలకు సూచనగా తన మెడలోని తెల్లటి ముత్యాల హారం తీసి హనుమంతుడి మెడలో వేశాడు. అప్పుడు, మెడలోని ఆ హారంతో చంద్రుడన్న మేరు శిఖరంలా శోభించాడు ఆంజనేయుడు.

అతని కళ్ళు జలత మాలికలయ్యాయి.

తటాలున వంగి రామ్రపభు పాదాలు తాకాడు.

కన్నీళ్ళతో స్వామి పాదాలు కడిగాడు.



రాముడు ఆంజనేయుడిని లేవదీసి ప్రేమగా శిరస్సు నిమిరాదు.

లోకోత్తర శక్తివంతుడైన హనుమంతుణ్ణి సంపూ ర్ణంగా గ్రహించి వర్తించాడు రామచంద్రుడు. ఆ స్వామి తత్వాన్నీ ఔన్నత్యాన్నీ ఆ మూలాగ్రం అర్థం చేసుకుని తన జీవితాన్నే అయనకు నివేదన చేశాడు హనువంతుడు.

*

చిరునామా:
ప్రయాగ రామకృష్ణ,
ఎ/11 అంబా గార్డెన్స్, మెహిదీపట్నం
హైదరాబాద్ – 500 028
సెల్: 9849990107 (రె) 23526555

ప్రపంచ వ్యాప్తంగా వ్యాపిస్తున్న స్వైన్ ఫ్లూ కన్నా భయంకరమైన వైరస్...
ఈ వైరస్‌ను మందులకు చావని రాక్షస దోమలు వ్యాప్తి చేస్తుంటే..
జ్వరాల బారిన పడ్డ ప్రజలు భయంతో ఊర్లొదలి పారిపోతున్నారు..
యెల్లెడలా నిర్జనం.. శ్మశాన నిశ్శబ్దం.. దీనికి ప్రజలు ప్రత్యక్ష దైవంగా భావించే
ఒకానొక డాక్టర్ కారణం... ఆ డాక్టర్‌ను ఎదుర్కొన్నదెవరు?
ఆ ప్రాణాంతక వైరస్‌ను నిర్మూలించిందెవరు?
డాక్టర్ చిత్తర్వు మధు
సైన్స్ ఫిక్షన్ నవల
హెచ్‌వైడి వైరస్
Hyd Virus
వచ్చేవారమే ప్రారంభం!!